సాక్షి
నల్లగొండ
బుధవారం । 26 । ఏప్రిల్ । 2023



కన్నీళ్లు మిగిల్చిన వడగండ్లు
ఇటీవల కురిసిన వడగళ్ల వానకు సుమారు 1391 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.
- 8లో



లోక రక్షణార్థమే ఏసు జననం
లోక రక్షణార్థమే ఏసుక్రీస్తు జన్మించారని కార్డినల్ పూల ఆంథోని పేర్కొన్నారు.
- 10లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 37°/24°
ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఈదురు గాలులు ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

డీఈఈ సెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : డీఈఈ సెట్ - 2023కు మే 25వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని నల్లగొండ ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నరసింహ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలను www.deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు పేర్కొన్నారు.

దళితబంధు యూనిట్ల పరిశీలన



నార్కట్‌పల్లి మండలం బాజకుంటలో షెడ్డును పరిశీలిస్తున్న శ్రీనివాస్

నల్లగొండ : దళితబంధు పథకం కింద మంజూరైన యూనిట్లను ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దళితబంధు కింద ఏర్పాటు చేసిన కోళ్ల ఫారం, కళ్లద్దాల షాపులను ఆయన తనిఖీ చేశారు. నార్కట్‌పల్లి మండలం బాజకుంటలో షెడ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. కనగల్ మండలం చెట్ల చెన్నారం గ్రామానికి చెందిన కాశిమల్ల సుధాకర్ నల్లగొండలో ఏర్పాటు చేసుకున్న ఆప్టికల్ షాపును పరిశీలించారు. దళితబంధు ద్వారా పొందుతున్న ఆదాయాన్ని మరింత పెంపొందించుకునేలా పలు సూచనలు చేశారు.

క్షయ నివారణపై విద్యార్థులకు శిక్షణ



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న డాక్టర్ స్టెల్లా అనా

రామగిరి(నల్లగొండ) : జాతీయ క్షయ నివారణ పథకం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఫేస్ టు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నల్లగొండలోని ఉమెన్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డబ్ల్యూహెచ్ఓ కన్సల్టెంట్ డాక్టర్ స్టెల్లా అనా, టీబీ స్టేట్ టెక్నికల్ ఆఫీసర్ బి.సురేష్ నల్లగొండ ఉమెన్స్ డిగ్రీ కళాశాల, హాలియా, చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు మాక్ సర్వేలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, క్లస్టర్ కాలేజెస్ కోఆర్డినేటర్ ఎస్.శ్రీనాథ్‌పటేల్, ఉమెన్స్ డిగ్రీ కళాశాల జువాలజీ ఇన్‌చార్జి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

నల్లగొండ రూరల్ : ఎడ్‌సెట్ దరఖాస్తు గడువు మే 1వ తేదీ వరకు పొడిగించినట్లు ఎడ్‌సెట్ - 2023 చైర్మన్, మహాత్మాగాంధీ యూనివర్సిటీ వీసీ గోపాల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కె.రఘునాథస్వామి

చందంపేట : గ్రామీణ ప్రాంత ప్రజలు తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ సూపరింటెండెంట్ కె.రఘునాథస్వామి తెలిపారు. మంగళవారం నేరెడుగొమ్ము మండలంలోని దాసర్లపల్లి, చందంపేట మండలంలోని యల్మలమంద గ్రామాల్లో తపాలా బ్రాంచి కార్యాలయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల గ్రామాలకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయాలనే ఉద్దేశంతో నూతన బ్రాంచి కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తిరుమలగిరి (సాగర్)లోనూ బ్రాంచి కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరకొండ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఎ.మధన్‌మోహన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ జోష్



సూర్యాపేట నియోజకవర్గ ప్లీనరీలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి



నల్లగొండలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కడియం శ్రీహరి, చిత్రంలో ఎమ్మెల్యే

- ఊరూరా గులాబీ జెండాల రెపరెపలు
- ప్లీనరీల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు
- సమావేశానికి దూరంగా పలువురు నేతలు
- రేపటి ప్రతినిధుల సభకు జిల్లా స్థాయి నేతల హాజరు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ పెరిగింది. మొన్నటివరకు ఆత్మీయ సమ్మేళనాలు, ఇప్పుడు ప్లీనరీతో క్షేత్రస్థాయిలోని కార్యకర్తల్లో ఉత్సాహం రెట్టింపైంది. పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల నేతృత్వంలో పెద్ద ఎత్తున ప్లీనరీలను నిర్వహించారు. ఉదయమే గ్రామాలు, మండలాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించిన అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశాలకు హాజరయ్యారు. అక్కడక్కడ ఆశావహులు సొంతంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించడం, కొంతమంది నేతలు ప్లీనరీలకు దూరంగా ఉండటం మినహా అన్ని నియోజకవర్గాల్లో కార్యక్రమాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

ప్లీనరీల్లో పాల్గొన్న ముఖ్య నేతలు

సూర్యాపేట నియోజకవర్గంలోని చివ్వెంల మండలంలో బీబిగూడెంలో జరిగిన ప్లీనరీలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితోపాటు ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఉన్నత విద్యా మండలి సభ్యుడు ఒ.నర్సింహారెడ్డి పాల్గొన్నారు. దేవరకొండలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మాజీ మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రవీంద్రకుమార్ పాల్గొనగా, మిర్యాలగూడలో గుత్తాతో పాటు ఎమ్మెల్యే భాస్కర్ రావు, నల్లగొండలో కడియం శ్రీహరి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు. నకిరేకల్‌లో ఎంపీ లింగయ్య యాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పాల్గొనగా, హుజూర్‌నగర్‌లో రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ సోమ భరత్, ఎమ్మెల్యే సైదిరెడ్డి, తుంగతుర్తిలో జెడ్పీ చైర్మన్ దీపిక, ఎమ్మెల్యే గాదరి కిశోర్, కోదాడలో మెట్టు శ్రీనివాస్, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, నాగార్జునసాగర్‌లో ట్రైకార్ చైర్మన్ రామచందర్ నాయక్, ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్ పాల్గొన్నారు. మునుగోడులో గొర్రెల మేకల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, విద్యా మౌలిక వసతుల కార్పొరేషన్ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఆలేరులో ప్రభుత్వ విప్ సునీత, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, భువనగిరిలో ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపటి సమావేశానికి ముఖ్య నేతలే..

ఈనెల 27వ తేదీన ప్రగతి భవన్‌లో నిర్వహించబోయే పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి అన్ని జిల్లాల ముఖ్య నేతలు మాత్రమే హాజరు కానున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి మంత్రి జగదీశ్‌రెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జెడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ రాష్ట్ర స్థాయి నేతలు, పార్టీ జిల్లా అధ్యక్షులు పాల్గొననున్నారు.

దూరంగా పలువురు నేతలు

ఎమ్మెల్యేల నేతృత్వంలో నిర్వహించిన ఈ ప్లీనరీలకు పలు నియోజకవర్గాల్లో కొంత మంది నేతలు దూరంగా ఉన్నారు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. నాగార్జునసాగర్‌లో ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గం నేతలు దూరంగా ఉన్నారు. ఆయన మాత్రం జనగామ ఇన్‌చార్జి కావడంతో అక్కడికి వెళ్లారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే చందర్ రావు, మున్సిపల్ చైర్మన్ శిరీష లక్ష్మీనారాయణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎర్నేని బాబు, ఇతర నేతలు పాల్గొనలేదు. నల్లగొండలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి చాడ కిషన్‌రెడ్డి, పట్టణ మాజీ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ దూరంగా ఉన్నారు.

విజయవంతంగా కార్యక్రమాలు

రెండోసారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించేందుకు పార్టీ పూనుకుంది. ఇందుకోసం గులాబీ శ్రేణులను సిద్ధం చేసేందుకు ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆదేశించింది. ఎమ్మెల్యేలు కూడా నిత్యం స్థానికంగా ప్రజల్లో ఉంటూ ప్రభుత్వ కార్యక్రమాలను వివరించడంతోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా ఆ దిశగా కృషి చేసేలా ఆత్మీయ సమ్మేళనాలు, ప్లీనరీలకు శ్రీకారం చుట్టింది. తద్వారా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మళ్లీ భారీ మెజారిటీతో గెలిపించేలా ప్రజలను చైతన్యపరిచే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలో ఎమ్మెల్యేల నేతృత్వంలో రెండు కార్యక్రమాలు విజయవంతమయ్యాయి.

ఉపాధి కూలీలకు పనులు కల్పించాలి



ఉపాధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

కట్టంగూర్ : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా కూలీలకు పనులు కల్పించాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కట్టంగూర్ మండలంలో పర్యటించారు. ఉపాధిహామీ పథకం కింద గుర్తించిన పనులు, కూలీల సమీకరణ, చేసిన పనులకు చెల్లింపులు, సగటు వేతనం తదితర అంశాలపై మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. ప్రతి గ్రామంలో రోజుకు సగటున 122 మంది కూలీలు మాత్రమే హాజరవుతున్నారని, కూలీల సంఖ్యను 200 పెంచాలని సూచించారు. ఉపాధిహామీ పనుల తనిఖీల్లో భాగంగా ప్రతి నియోజకవర్గానికి తనతో పాటు అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ, జెడ్పీ సీఈఓ, డీపీఓ, ఏపీడీలను నియమించి పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కట్టంగూర్ పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళా కేంద్రాన్ని డీఎంహెచ్ఓ కొండల్‌రావుతో కలిసి పరిశీలించారు. కట్టంగూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కాంటాలను వేగవంతం చేయాలని నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట ఎంపీడీఓ పోరెళ్ల సునీత, ఎంపీఓ మహ్మద్ అర్థర్ పర్వేజ్, ఏపీఓ కడెం రామ్మోహన్, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కంటి పరీక్షలు చేయించుకోవాలి

నల్లగొండ టౌన్ : కంటి వెలుగు శిబిరంలో 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నల్లగొండ పట్టణంలోని పానగల్ ఆర్యసమాజ్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి వెలుగు శిబిరానికి వచ్చే విధంగా ప్రజలకు ముందస్తుగా సమాచారం ఇచ్చి ప్రజలు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేలా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. అవసరం మేరకు అద్దాలను స్టాక్ ఉంచుకొని వెంటనే అందించాలని సూచించారు. జిల్లాలో ఇప్పటికే 80 శాతం మందికి పరీక్షలు పూర్తి చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా

దేవరకొండ : దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూగుప్తా అధికారులకు సూచించారు. మంగళవారం దేవరకొండ పట్టణంలో ఆమె పర్యటించారు. పట్టణంలోని 6, 7వ వార్డుల్లో పట్టణ ప్రకృతి వనాలు, ఖిలా ఆవరణలో రూ.5 కోట్లతో చేపట్టిన పార్క్ నిర్మాణ పనులు, రూ.1 కోటితో నిర్మిస్తున్న వైకుంఠధామం, మురుగునీటి శుద్ధి కేంద్రం పనులు పరిశీలించి సంబంధిత అధికారులకు ఆమె పలు సూచనలిచ్చారు. అనంతరం పట్టణ శివారులోని నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ ప్రకృతి వనాలతో పాటు నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పురోగతిలో ఉన్న ఎస్టీపీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ సరిగాలేకపోవడంతో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌కు నోటీస్ జారీ చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. అంతకు ముందు పట్టణంలోని ఓపెన్ ఇంటర్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ఆమె వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య, ఏఈలు రాజు, సక్రూనాయక్ తదితరులు ఉన్నారు.



మొక్కల పెంపకంపై అధికారులకు సూచనలిస్తున్న అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా

ఒక్క ఇల్లూ కట్టించని కేంద్రం

రామగిరి(నల్లగొండ) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా సంవత్సరానికి రెండు కోట్ల ఇళ్లు కట్టిస్తామన్న చెప్పిన బీజేపీ ప్రభుత్వం తొమ్మిదేళ్లలో ఒక్క ఇల్లు కూడా కట్టించలేదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య విమర్శించారు. తిప్పర్తి మండల కేంద్రంలోని నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశాల సందర్భంగా ఆ సంఘం జాతీయ సహాయ కార్యదర్శి సునీత్ చోప్రా సంతాప సభ నిర్వహించారు. ఈ సభలో నాగయ్య మాట్లాడుతూ కేంద్రంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా పేద, గిరిజనుల విలువైన భూములను కార్పొరేట్ శక్తులకు అప్పనంగా ఇస్తోందని మండి పడ్డారు. సమావేశంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారి ఐలయ్య, జిల్లా అధ్యక్షుడు బొజ్జ చిన వెంకులు, దండంపల్లి సరోజ, కత్తుల లింగస్వామి, సైదులు, రవి నాయక్, రాములు, భిక్షం, రాములు, లూర్దు, మారయ్య, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

పాడి సంపద పెంచేలా..

- కృత్రిమ గర్భధారణ ద్వారా ఆడ దూడలు పుట్టేలా ప్రత్యేక వీర్యం
- ముందుగా ఆవులకు.. త్వరలో గేదెలకు
- కార్యాచరణ రూపొందించిన జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ

నల్లగొండ అగ్రికల్చర్ : పాడి సంపదను పెంచడం ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ద్వారా ఇప్పటికే పాడి గేదెలకు కృత్రిమ గర్భధారణ చేపడుతున్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కృత్రిమ గర్భధారణ ద్వారా సగం ఆడ, సగం మగ దూడలు పుడుతున్నాయి. దీంతో రైతులకు మగ దూడల పోషణ భారంగా మారుతోంది. దీనివల్ల ఆశించిన స్థాయిలో ఆర్థికంగా ఎదగలేకపోతున్నామనే భావన రైతుల్లో ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ప్రత్యేక సెమన్ (వీర్యం) ద్వారా కృత్రిమ గర్భధారణ చేయడం వల్ల పాడి గేదెలు, ఆవుల్లో ఆడ దూడలను పుట్టించాలని లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్వరలో ఈ ప్రత్యేక కృత్రిమ గర్భధారణ చేయడానికి అవసరమైన ప్రణాళికను రూపొందించింది. పలు రాష్ట్రాల్లో ఇప్పటికే ఆడ దూడలను పుట్టించేందుకు అవసరమైన సెమన్ కోసం చేసిన ప్రయోగం ఫలించింది. దీనికి పీవీ నర్సింహారావు వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆమోదం తెలిపినట్లు తెలిసింది.



ముందుగా ఆవులకు..

ప్రత్యేక సెమన్ ద్వారా ఆవులకు ముందుగా కృత్రిమ గర్భధారణ చేయన్నారు. తెల్లజాతి పశువులైన ఆవుల్లో జెర్సీ, నల్లమచ్చలతో ఉండే తెల్లావు, మహారాష్ట్రకు చెందిన సాహివాల్ జాతికి చెందిన ఆవుల సెమన్‌ను అందుబాటులో ఉంచారు. మంగళవారం యాదాద్రి జిల్లా భువనగిరి మండలంలోని వీరవెల్లి గ్రామంలో ఆవులకు ప్రత్యేక సెమన్‌తో కృత్రిమ గర్భధారణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంచించారు. పది రోజుల్లో గేదెలకు కూడా ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ధర ఇలా..

ఇప్పటి వరకు చేస్తున్న కృత్రిమ గర్భధారణకు రైతు నుంచి నామమాత్రంగా రూ.100 వసూలు చేస్తున్నారు. ఆడదూడ పుట్టేందుకు చేసే కృత్రిమ గర్భధారణకు ధరను మాత్రం రూ.675 నిర్ణయించారు. అందులో రైతు వాటా రూ.250 చెల్లిస్తే ప్రభుత్వం రూ.425లను చెల్లిస్తుంది. రైతులు కోరిన వెంటనే ఆడదూడలు పుట్టేలా కృత్రిమ గర్భధారణ చేయనున్నారు. దీనికి గాను ఇప్పటికే 875 యూనిట్‌ల సెమన్‌ను జిల్లాకు తెప్పించి భద్రపరిచనట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో పాడి సంపద ఇలా..

పశువులు	నల్లగొండ	సూర్యాపేట	యాదాద్రి
సంకరజాతి ఆవులు	9,508	2,511	36,347
దేశవాళీ ఆవులు	63,342	52,376	12,929
దేశవాళీ గేదెలు	1,05,603	80,190	34,759
ముర్రాజాతి గేదెలు	54,550	44,967	42,324

దేశ సంపదను దోచిపెడుతున్న కేంద్రం



సీపీఐ పోరుయాత్రలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి


కొండమల్లేపల్లి : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను తాకట్టు పెడుతూ దేశ సంపదను పెట్టుబడిదారులకు దోచిపెడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి విమర్శించారు. ఇంటింటికీ సీపీఐ పోరుయాత్రలో భాగంగా మంగళవారం కొండమల్లేపల్లి మండలంలోని చెన్నారం, ఆంబోతుతండా, గన్యనాయక్‌తండా, కేశ్యతండా, కొత్తబాయి, గౌరికుంట తండా, గుమ్మడవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విభజన సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కేంద్రం పూర్తిగా విఫలమైందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ ధరలను పెంచి సామాన్యులపై భారం మోపిందని మండిపడ్డారు. కార్యక్రమంలో గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమావత్ అంజయ్యనాయక్, పల్లా దేవేందర్‌రెడ్డి, ఎండీ.మైనొద్దీన్, గుమ్మికొండ వెంకటేశ్వర్‌రెడ్డి, కె.జయరాములు, ఎం.వెంకటయ్య, నూనె రామస్వామి, డి.సుదర్శన్‌రెడ్డి, నూనె వెంకటేశ్వర్లు, శేఖరాచారి, చరణ్‌రెడ్డి, సోమ్లా నాయక్, సర్పంచ్ కిన్నెర యాదయ్య, వెంగలయ్య, అర్జున్, వెంకట్రాములు, మల్లయ్య, గణేశ్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న ఇంటర్, డిగ్రీ గురుకులాల ప్రవేశపరీక్ష

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బీసీ ఇంటర్, డిగ్రీ బాలుర, బాలికల గురుకుల కళాశాలల్లో ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు ఈ నెల 30వ తేదీన ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఆర్‌సీఓ ఎం.షకీనా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.www.mjptbcwreis.telangna.gov.in, www.mjptbcwreis.cgg.gov.in వెబ్‌సైట్లలో హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. నల్లగొండ 22, సూర్యాపేట 11, యాదాద్రి జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇంటర్మీడియట్‌కు 7,790, డిగ్రీకి 1083 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో ఇంటర్మీడియట్ 26 కళాశాలల్లో 2,240, డిగ్రీ ఒక కళాశాలలో 320 సీట్లు ఉన్నాయని వివరించారు.

ఆర్టిజన్ల సమ్మె పాక్షికం

- నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో ఎక్కువ సంఖ్యలో విధులకు హాజరు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో 50 శాతం మందే..
- పెద్దగా కనిపించని సమ్మె ప్రభావం



నల్లగొండ : విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె మంగళవారం పాక్షికంగా జరిగింది. నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అంతంత మాత్రంగానే జరగగా.. యాదాద్రి భువనగిరిలో మాత్రం అధిక సంఖ్యలో ఆర్టిజన్లు సమ్మెలో పాల్గొన్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సమ్మె ప్రభావం పెద్దగా కనిపించలేదు. పోలీసులు ఆర్టిజన్ ఉద్యోగులను మంగళవారం పోలీస్‌స్టేషన్లకు పిలిపించుకొని సమ్మెలో పాల్గొనవద్దని రాయించుకొని పంపించారు.

యాజమాన్యాలకు ముందుగానే నోటీసులు

ఆర్టిజన్ హెచ్82 ఉద్యోగ సంఘాలు 25 నుంచి సమ్మెలో పాల్గొంటున్నామని యజమాన్యాలకు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. ఎస్మా చట్టం అమల్లో ఉన్నందున సమ్మెలో పాల్గొంటే సర్వీస్ నుంచి తొలగిస్తామని విద్యుత్ యాజమాన్యాలు హెచ్చరించాయి. సోమవారం ముందస్తు అరెస్టులు, బైండోవర్లను కూడా చేపట్టారు. దీంతో మంగళవారం సమ్మె ప్రభావం పెద్దగా కనిపించలేదు. ఆర్టిజన్లు అక్కడక్కడా సమ్మెలో పాల్గొన్నా ఎక్కడా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా విద్యుత్ అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. దీంతో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదు.

జిల్లాల వారీగా..

- నల్లగొండ జిల్లాలో మొత్తం 529 మంది ఆర్టిజన్లు ఉండగా 40 మంది మినహా ఉద్యోగులంతా విధులకు హాజరయ్యారు. నల్లగొండ డివిజన్‌లో 249 మందికి గాను 40 మంది విధులకు హాజరు కాలేదు. మిర్యాలగూడలో 139 మందికి అందరూ విధులకు హాజరయ్యారు. దేవరకొండ డివిజన్‌లో 141 మందికి మొత్తం విధులకు హాజరయ్యారు.
- సూర్యాపేట జిల్లాలో కూడా సమ్మె పాక్షికంగానే జరిగింది. జిల్లాలో 323 మంది ఉద్యోగులు ఉంటే అక్కడ కూడా 40 మంది వరకే ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. మిగతా వారంతా విధులకు హాజరయ్యారు.
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆర్టిజన్ ఉద్యోగులు సమ్మెలో అధికంగా పాల్గొన్నారు. 312మంది ఉద్యోగులు ఉంటే 170 మంది వరకు సమ్మెలో పాల్గొన్నారు. హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో అక్కడి ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు.

అందరూ విధులకు వస్తారని ఆశిస్తున్నాం

నల్లగొండ జిల్లాలో కొద్దిమంది మాత్రమే ఆర్టిజన్ ఉద్యోగులు సమ్మెలో పాల్గొన్నారు. వారంతా ఈ రోజు విధులకు హాజరవుతారని ఆశిస్తున్నాం. ఎస్మా చట్టం అమలులో ఉన్నందున యజమాన్యం నిబంధనల ప్రకారం సమ్మెలో పాల్గొనవద్దు. ఆర్టిజన్లు అందరూ విధులకు హాజరవుతారని భావిస్తున్నాం.
– చంద్రమోహన్, ఎస్ఈ

క్లుప్తంగా

వరి కోత మిషన్ ఢీకొని రైతు మృతి


ఉపేందర్ (ఫైల్)

గుండాల: ప్రమాదవశాత్తు వరి కోత మిషన్ ఢీకొని రైతు ప్రాణాలు కోల్పోయిన ఘటన మండలంలోని బండకొత్తపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండకొత్తపల్లి గ్రామానికి చెందిన కన్న ఉపేందర్(35) సోమవారం ఉదయం అదే గ్రామానికి చెందిన ఎరుక రమేష్‌రెడ్డికి చెందిన వరి కోత మిషన్‌తో తన వరి పొలాన్ని కోయించి ధాన్యాన్ని దేవరుప్పులలో విక్రయించాడు. తిరిగి రాత్రి రమేష్‌రెడ్డి తన సొంత పొలాన్ని కోస్తుండగా, అదే సమయంలో ఉపేందర్ అక్కడికి వెళ్లాడు. ఇది గమనించని రమేష్‌రెడ్డి వరి కోత మిషన్‌ను వెనుకకు తీస్తున్న ఉపేందర్‌కు తగిలి వెనుక టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య యామిని మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ యాకన్న తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.

చికిత్స పొందుతూ గుర్తుతెలియని మహిళ మృతి


గుర్తుతెలియని మహిళ మృతదేహం

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. మిర్యాలగూడ టూటౌన్ సీఐ ఏ. నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని రైతుబజారు సమీపంలో ఓ గుర్తుతెలియని మహిళ అనారోగ్యంతో బాధపడుతుండడంతో స్థానికులు అంబులెన్స్‌లో ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలి వయస్సు సుమారు 35 నుంచి 40 ఏళ్లు ఉంటాయని, చామనఛాయ రంగులో, 5.2 అంగులాల ఎత్తు ఉంటుందని సీఐ తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు 8712670150, 9014555290 నంబర్లకు సమాచారం ఇవ్వాలని అన్నారు.

బ్రేక్ ఫెయిలై లారీ బోల్తా


బోల్తా పడిన లారీ

మోత్కూరు: హ్యాండ్ బ్రేక్ ఫెయిలై లారీ కాలువలో బోల్తా కొట్టిన సంఘటన మోత్కూరు మండలం పాటిమట్ల గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాల ప్రకారం.. పాటిమట్ల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ ఎడమ నర్సిరెడ్డి పాటిమట్ల ఎక్స్ రోడ్డు వద్ద ధాన్యం లోడ్ చేసుకొని అక్కడే ఉన్న బస్టాండ్ వద్ద హ్యాండ్ బ్రేక్ వేసి లారీ నిలిపాడు. లారీ దిగి ధాన్యానికి సంబంధించిన పేపర్లు తీసుకొని రావడానికి వెళ్లగా ఇంజన్ ఆన్‌లోనే ఉండడంతో హ్యాండ్ బ్రేక్ ఫెయిల్ అయి లారీ ముందుకు కదిలి పక్కనే ఉన్న బృందావం కాలువలోకి దూసుకెళ్లి పల్టీ కొట్టింది. దీంతో లారీ పూర్తిగా ధ్వంసమైంది. మంగళవారం బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కన్నీళ్లు మిగిల్చిన వడగండ్లు

- దేవరకొండ, డిండి మండలాల్లో సుమారు 1391 ఎకరాల్లో పంట నష్టం
- దెబ్బతిన్న పంటలను పరిశీలించిన వ్యవసాయాధికారులు

దేవరకొండ: మండలంలో సోమవారం కురిసిన వడగండ్ల వానకు 391ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి రవికుమార్ తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని తాటికోల్, తెలుగుపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. పంట నష్టపోయిన రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మొత్తం 391ఎకరాలకు గాను 374ఎకరాల్లో వరి, 13ఎకరాల్లో ఆముదం, 4ఎకరాల్లో ఎర్ర మిరప పంట నష్టం జరిగిందని పేర్కొన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు దెబ్బతినడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

డిండి మండలంలో 1000 ఎకరాల్లో..

డిండి: మండలంలో అకాల వర్షానికి దాదాపు 1000 ఎకరాల్లో వరి పంటకు నష్టం జరిగినట్లు ఏడీఏ వీరప్ప తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని ఎర్రారం, కామేపల్లి, కందుకూర్, ఖానాపూర్, దాసరినెమలిపూర్, కె.గౌరారం, టి.గౌరారం, బొల్లనపల్లి, గోనబోయనపల్లి గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న పంట పొలాలను సంబంధిత ఏఈఓలతో కలిసి ఆయన పరిశీలించారు. వడగండ్ల వానతో దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి తగు నివేదిక తయారుచేసి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఏఓ శివరాం, ఏఈఓలు సాయితేజ, పరమేశ్వరి, సరిత, జ్యోతి ఉన్నారు.


దేవరకొండ: నేలకొరిగిన వరి పంట


దేవరకొండ: పంట నష్టం వివరాలు సేకరిస్తున్న అధికారులు


డిండి: ఖానాపూర్‌లో దెబ్బతిన్న వరిచేనును పరిశీలిస్తున్న ఏఈఓ సాయితేజ

నకిరేకల్‌లో ఈదురుగాలులతో వర్షం


ధాన్యం రాశుల వద్ద చేరిన వర్షపు నీరు

నకిరేకల్: నకిరేకల్ మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం కురిసింది. దీంతో మంగళపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసిపోయింది. గ్రామంలోని బస్టాప్ వద్ద కూరగాయల ఆటో మీద చెట్టు కూలి పడింది. ఆటోలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.


మంగళపల్లిలో ఆటోపై కూలిన చెట్టు

ఇద్దరు దొంగలు అరెస్టు.. రిమాండ్

సూర్యాపేట క్రైం: పట్టణంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలను సూర్యాపేట పట్టణ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం ఈ కేసుకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. కొత్త బస్టాండ్ వద్ద సీఐ రాజశేఖర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేస్తుండగా ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన అబ్దుల్ మతీన్, విజయవాడలోని పంజాబ్ సెంటర్‌కు చెందిన షేక్ కరీం అలియాస్ మస్తాన్ బైక్‌పై వస్తున్నారు. వారు అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని విచారించగా.. ఈ నెల 15న రాత్రి సమయంలో సూర్యాపేట పట్టణంలోని గోపాలపురం, జమ్మిగడ్డలో రెండు ఇళ్లలో దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి దొంగలించిన ఒక అపాచీ బైక్, తులంన్నర బంగారు చైన్, లాకెట్, 3తులాల నల్లపూసల గొలుసు, 20తులాల వెండి పట్టీలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.4లక్షలు ఉంటుందన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులు ఇద్దరిని రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ రాజశేఖర్, ఎస్‌ఐ యాకూబ్, సిబ్బంది గొర్ల కృష్ణ, గోదేసి కర్ణాకర్, సైదులు, మధు తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం

వ్యభిచారం కేసులో ముగ్గురు అరెస్ట్

హుజూర్‌నగర్: మహిళకు డబ్బు ఆశ చూపి ఆమెతో వ్యభిచారం నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులను, ఒక విటుడిని హుజూర్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని మేఘన ఆస్పత్రి సమీపంలో ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఎస్‌ఐ వెంకటరెడ్డి తన సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. ఈ దాడిలో భాగంగా వ్యభిచార గృహం నడిపిస్తున్న చింతలపాలెం గ్రామానికి చెందిన షేక్ మహబూబ్, హుజూర్‌నగర్‌కు చెందిన మంద గోపితో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా పిడుగురాళ్లకు చెందిన ఒక మహిళ, మఠంపల్లి మండలం పెద్దవీడుకు చెందిన విటుడు షేక్ ముబాషీర్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

లారీ తగిలి విరిగిన విద్యుత్ స్తంభం

మోత్కూరు: లారీ తగిలి విద్యుత్ స్తంభం విరిగిన సంఘటన మంగళవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని నార్కట్‌పల్లి–మోత్కూరు రోడ్డుపై చోటు చేసుకుంది. వివరాలు.. నార్కట్‌పల్లి మండలంలోని కక్కిరేణి నుంచి ధాన్యం లోడ్‌తో మోత్కూరు వైపు వెళ్తున్న లారీ మోత్కూరు పట్టణంలోని భారత్ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభానికి తగలడంతో స్తంభం విరిగిపోయింది. ఇది గమనించిన స్థానికులు కేకలు వేయడంతో డ్రైవర్ లారీని నిలిపివేశాడు. విద్యుత్, మున్సిపాలిటీ అధికారులు స్పందించి మోత్కూరు పట్టణంలోని ప్రధాన రోడ్డు వెంట ఉన్న చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలను రోడ్డుకు దూరంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


విరిగిన విద్యుత్ స్తంభం

బతుకుదెరువు కోసం వెళ్తూ..

- రోడ్డు ప్రమాదంలో తాత మృతి, మనుమడికి గాయాలు
- జనగామ జిల్లా దేవరుప్పల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో చోటుచేసుకున్న ఘటన
- మృతుడి స్వస్థలం మునుగోడు మండల కేంద్రం

దేవరుప్పుల: బతుకుదెరువు కోసం వెళ్తూ రోడ్డు ప్రమాదంలో తాత చనిపోగా, మనుమడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలో మంగళవారం జరిగింది. ఎస్సై మునావత్ రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా మునుగోడు మండల కేంద్రానికి చెందిన తాతమనుమళ్లు చినబత్తుల సైదులు(75), తిరుపతి ఆయుర్వేద మందుల వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలోనే మంగళవారం సూర్యాపేట– జనగామ రహదారి గుండా మహారాష్ట్రకు మారుతీ వ్యాన్‌లో వెళ్తుండగా సింగరాజుపల్లి టోల్‌గేట్ సమీపంలోని ధారావత్‌తండా పరిధిలో వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొట్టారు. ఈ ఘటనలో సైదులు అక్కడికక్కడే మృతిచెందగా.. మనుమడు తిరుపతి కాళ్లు విరిగి తలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు. సైదులు కుమారుడు రాములు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


ప్రమాదస్థలిలో సైదులు మృతదేహం

పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తా

- 16 పశువులు మృతి
- మాధారంకలాన్ సమీపంలో 365వ నంబర్ హైవేపై ప్రమాదం

శాలిగౌరారం: పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం బోల్తాపడి 16 పశువులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమ గోదావరి జిల్లా ఏపూరు నుంచి హైదరాబాద్‌లోని మౌలాలికి పశువుల లోడుతో వెళ్తున్న డీసీఎం(టీఎస్ 13 యుసి 5881)ను డ్రైవర్ అతివేగంగా నడపడంతో అదుపుతప్పి శాలిగౌరారం మండలంలోని మాధారంకలాన్ గ్రామ సమీపంలో 365వ నంబర్ జాతీయ రహదారి పక్కన బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డీసీఎంలో ఉన్న 48 పశువులలో 15 పశువులు ప్రమాదస్థలంలోనే మృతిచెందగా మరో 33 పశువులకు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన పశువులలో మరొకటి సాయంత్రం మృతిచెందింది. దీంతో మృతిచెందిన పశువుల సంఖ్య 16కు చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ సతీష్ సిబ్బందితో ప్రమాద స్థలానికి చేరుకొని స్థానికుల సహాయంతో గాయాలపాలైన పశువులను డీసీఎం నుండి బయటకు తీశారు. డీసీఎం డ్రైవర్ పరారయ్యాడని, స్థానిక పంచాయతీ కార్యదర్శి శివకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా గాయాలపాలైన పశువులను ఎస్‌ఐ సూచన మేరకు సర్పంచ్ జేరిపోతుల మంజులచంద్రమౌళి స్థానికంగా ఉన్న ఓ ఫంక్షన్‌హాల్ వద్ద ఉంచి గ్రామపంచాయతీ ట్యాంకర్ సహాయంతో తాగునీరు అందించడంతో పాటు గడ్డివేసి కాపాడుతున్నారు.


ప్రమాదంలో మృతిచెందిన పశువులు

మూడు ఇళ్లలో దొంగతనం

- మరో ఇంట్లో చోరీ చేసేందుకు యత్నిస్తుండగా గుర్తించిన స్థానికులు
- కేకలు వేయడంతో పారిపోయిన దొంగలు
- చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లక్కారంలో ఘటన

చౌటుప్పల్ : మున్సిపాలిటీ పరిధిలోని లక్కారం గ్రామంలో మంగళవారం తెల్లవారుజామున తాళం వేసి ఉన్న మూడు ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. మరో ఇంట్లో దొంగతనానికి యత్నిస్తుండగా స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో పరారయ్యారు. బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్కారం గ్రామంలోని వినాయకనగర్ కాలనీకి చెందిన గడగొట్టి మల్లేష్ ఇంట్లో అద్దెకు ఉండే రాజు కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి తమ సొంతూరైన ఆంధ్రా ప్రాంతానికి వెళ్లారు. మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి అర తులం బంగారం చోరీ చేశారు. అంతేకాకుండా సమీపంలోనే ఉండే వంగూరి నర్సింహ కుటుంబ సభ్యులు తమ ఇంట్లోని ఒక పోర్షన్‌కు తాళం వేసి మరో పోర్షన్‌లో నిద్రించారు. ఇంటి తాళం పగులగొట్టిన దొంగలు లోనికి వెళ్లి బీరువాలోని రూ.10వేల నగదు, వెండి సామాగ్రి ఎత్తుకెళ్లారు. ఇంటికి తాళం వేసి కంపెనీలో డ్యూటీ నిమిత్తం వెళ్లిన బుద్ధ నర్సింహ ఇంట్లో రూ.9వేల నగదును ఎత్తుకెళ్లారు. సమీపంలోనే ఉన్న ఊదరి నరేష్ ఇంట్లో దొంగతనం చేసేందుకు యత్నిస్తుండగా స్థానికులు గుర్తించి కేకలు వేశారు. దీంతో దొంగలు అక్కడి నుండి పారిపోయారు. పారిపోతున్న సమయంలో ముగ్గురు వ్యక్తులు ఉన్నట్టు స్థానికులు చెబుతున్నారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

యాదగిరిగుట్ట రూరల్: పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్లాపురం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపురం గ్రామానికి చెందిన బత్తెపు నరేష్(30) మేస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమవారం మధ్యాహ్నం తన వ్యవసాయ బావి వద్ద ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి వెంటనే అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. కాగా అప్పులు బాధతోనే నరేష్ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలుస్తోంది. మృతుడి తండ్రి కిష్టయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్‌రావు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రాస్తారోకో


ముక్కుడుదేవులపల్లి స్టేజీ వద్ద రాస్తారోకో చేస్తున్న రైతులు

ఆత్మకూర్–ఎస్ (సూర్యాపేట): మండలంలోని ముక్కుడుదేవులపల్లి గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ రైతులు మంగళవారం గ్రామ ఎక్స్‌రోడ్డు వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో అకాల వర్షాలతో తీవ్ర అవస్థలు పడుతున్నామని అన్నారు. గ్రామగ్రామానికి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్న ప్రభుత్వం తమ గ్రామంలో ఎందుకు ఏర్పాటు చేయలేదని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి వెంటనే గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటకు పైగా రాస్తారోకో నిర్వహించడంతో సూర్యాపేట–దంతాలపల్లి రహదారిపై పెద్దఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న మండల తహసీల్దార్ పుష్ప, ఎస్‌ఐ యాదవేందర్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి రైతులతో మాట్లాడి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో రైతులు ఫయాజ్, శ్రీను, మధు, మల్లేష్, లింగయ్య, నాగరాజు, వెంకన్న తదితరులు ఉన్నారు.

సస్యరక్షణతోనే అధిక దిగుబడులు

- కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అనిత

నడిగూడెం : కూరగాయలలో ప్రధానమైన కూరగాయ టమాట. ఈ పంటను బోర్లు, బావుల కింద జిల్లాలో పలు గ్రామాల్లో రైతులు సాగు చేపట్టారు. ఈ పంటకు అధికంగా ఛీడ, పీడలు ఆశిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎప్పటికప్పుడు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కోదాడ డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి అనిత చెబుతున్న సలహాలు..

ఆశించే పురుగులు.. నివారణ చర్యలు

కాయతొలుచు పురుగు : ఈ పురుగు టమాట పంటను నష్టం చేసే పురుగుల్లో ప్రధానమైనది. ఇది లేత ఆకులను, కొమ్మలపై ఆశించి తినివేస్తుంది. కోతదశలో ఉన్న కాయలను తొలచి నాశనం చేస్తుంది. అధికంగా పంటను నష్టపరుస్తుంది. దీని నివారణకు ఎరపంటగా బంతిని వేసుకోవాలి(ఒక వరుస బంతి, 16 వరుసలు టమాట వేసుకోవాలి). ట్రైకోగ్రామా బదనికలు ఎకరానికి 20,000 చొప్పున పొలంలో విడుదల చేయాలి. ఎకరానికి నాలుగు చొప్పున లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేయాలి. క్రిమి సంహారక మందును పిచికారీ చేసే ముందు కాయలను కోయాలి.

పచ్చదోమ : ఆకుల అడుగు భాగం నుంచి రసాన్ని పీల్చడం వలన, ఆకుల చివర్లు పసుపు పచ్చగా మారి, క్రమేపీ ఆకు అంతా ఎర్రబడి చివరగా ఆకులు ముడుచుకొని దోనెలలాగా కనిపిస్తాయి. దీని నివారణకు డైమీథోయేట్ లేదా ఫిప్రోనిల్ 2. మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అక్షింతల పురుగు : పిల్లపురుగులు, పెద్ద పురుగులు ఆకుల పత్రహరితమును గోకి తిని వేయును. ఆశించిన ఆకులు తెరవలె కన్పించును. దీని నివారణకు ప్రొఫెనోఫాస్ లీటరు నీటికి 2 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.


సాగులో ఉన్న టమాట

ఆశించే తెగుళ్లు.. నివారణ చర్యలు..

నారుకుళ్లు తెగులు : ఈ తెగులు ఆశించడం వలన నారుమడిలో మొక్కల మొదళ్లు కుళ్లిపోయి నారు గుంపులు గుంపులుగా చనిపోతుంది. విత్తటానికి ముందు తప్పనిసరిగా 3.గ్రాముల థైరం లేదా మాంకోజెబ్ కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ధి చేయాలి. పిదప ట్రైకోడెర్మా విరడే అను శిలీంధ్రనాశినని 4 గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి నారు పోయాలి. నారుమడిలో తెగులు కనిపించిన వెంటనే కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో 2–3 సార్లు తడపాలి.


పాడి పంట

వడలు తెగులు (బ్యాక్టీరియల్ విల్టు) : ఇది మొక్క అడుగు బాగంలోని ఆకులు పసుపు రంగుకుమారి తొడిమతో సహారాలి తర్వాత మొక్క వడలిపోయి, చనిపోతాయి. దీని నివారణకు బలమైన మొక్కలు నుంచి విత్తనాలను ఎన్నుకోవాలి. తెగులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో తెగులు తట్టుకొనే రకాలను వాడుకోవాలి. నేల ఉదజని 3.6నుంచి 5 వరకు ఉన్న ఆమ్ల భూముల్లో ఈ తెగులు తట్టుకుంటుంది. పంట మార్పిడి అవలంభించాలి.

వైరస్ తెగులు : ఈ తెగులు సోకిన మొక్కల ఆకుల మీద, అక్కడక్కడ పసుపు మచ్చలు ఏర్పడి, ఆకులు ముడుచుకొని, మొక్క గిడసబారి ఎండిపోతుంది. ఆకులు పెళుసుగా తయారవుతాయి. దీని నివారణకు తెగులు ఆశించిన మొక్కలను పీకి నాశనం చేయాలి. తెగులును వ్యాప్తి చెందించకుండా రసం పీల్చే పురుగుల(పేనుబంక) నివారణకు అంతర్వాహిక కీటక నాశులను పిచికారీ చేసుకోవాలి.

ఆకుమాడు తెగులు

ఈ తెగులు ఆకులు, కాండం, కాయల మీద గోదుమ రంగుతో కూడిన మచ్చలు ఏర్పడి క్రమేణా ఆకులు మాడి ఎండిపోతాయి. మొక్క దశలో ఎప్పుడయినా ఆశించవచ్చు. తేమ ఉన్న చల్లని వాతావరనంలో ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా ఆశిస్తుంది. దీని నివారణకు 3 గ్రాములు కాప్టాన్ లేదా మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి 15 రోజుల వ్యవధిలో 3 లేదా 4 సార్లు పిచికారీ చేయాలి.

సలహాలు... సూచనలు

- ఫ్రెంచి చిక్కుడు పంటతో పంటమార్పిడే చేస్తే బ్యాక్టీరియా ఎండు తెగులు కొంతవరకు తగ్గుతుంది.
- ఆవాలు మరియు బంతి, ధాన్యపు పంటలతో పంటమార్పిడి చేయడం వలన నులిపురుగుల ఉధృతి తగ్గుతుంది.
- కిలో విత్తనానికి ముందుగా 3 గ్రా. థైరం ఆ తర్వాత 8 గ్రా.ట్రైకోడెర్మా కల్చర్‌తో విత్తనశుద్ధి చేయాలి.
- వేసవిలో దుక్కులు లోతుగా దున్నడం వలన భూమిలో ఉన్న నిద్రావస్త దశలో ఉన్న పురుగులు చనిపోతాయి.
- ట్రైకోడెర్మా కల్చర్ (ఒక కిలో కల్చర్‌ను 10 కిలోల వేపపిండి మరియు 90 కిలోల పశువుల ఎరువులో కలిపి) దుక్కిలో వేసుకోవాలి.
- పొలం చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను అడ్డుపంటగా వేయడం వలన రసం పీల్చు పురుగుల ఉధృతి తగ్గుతుంది. వైరస్ తెగులు కూడా కొంతవరకు తగ్గుతుంది.
- అలాగే పొలంలో అక్కడక్కడ ఆముదం మొక్కలపై ఉన్న గ్రుడ్ల సమూదాయాలను, అప్పుడు పొదగబడిన పిల్ల పురుగులను ఏరివేయాలి.
- పొలంలో అక్కడక్కడ ఎకరానికి 4 చొప్పున పసుపు రంగు పూసిన రేకులకు ఆముదం లేదా గ్రీజ్ పూసి పెట్టాలి. తెల్లదోమలు వీటికి ఆకర్షింపబడి అతుక్కుంటాయి.
- ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు పెట్టి పచ్చపురుగు మరియు రబ్బరు పురుగుల యొక్క ఉనికిని గమనించాలి.
- పొలంలో ఎకరానికి 20 పక్షిస్థావరాలను ఏర్పాటు చేయాలి.